సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



వినోదం.. వికాసం.. విజ్ఞానం

బెల్లంపల్లిలోని సీఓఈ విద్యాలయం ప్రతిభావంతంగా రాణిస్తోంది. మెరుగైన విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన, పచ్చదనం, క్రమశిక్షణలో సత్తా చాటుతోంది. 8లో▸



'ఉపాధి'లో నారీలోకం

ఉపాధి హామీ పథకం పనుల్లో మహిళా లోకం సత్తా చాటుతోంది. భారీ సంఖ్యలో పాల్గొంటూ ఆదర్శనంగా నిలుస్తోంది. ఉపాధి హామీ పథకం పనుల్లో మేము సైతం అంటున్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /27.0

వాతావరణం

ఆకాశం ఉదయం వేళ ప్రకాశవంతంగా, రాత్రి వేళ మేఘావృతమై ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని మూడు గ్రంథాలయాల్లో గ్రూప్స్, డీఎస్సీ తదితర ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు మంగళవారం కలెక్టరేట్‌లో ఏకేఎస్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అవగాహన, స్కిల్‌టెస్ట్ నిర్వహిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల గ్రంథాలయాల్లో 400 మంది వరకు అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న వివిధ పరీక్షలకు పుస్తకాలు, వైఫై, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. స్కిల్‌టెస్ట్, పరీక్షపై నిపుణులతో అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మండలంలో హెలికాప్టర్ చక్కర్లు

భీమారం: మండల కేంద్రమైన భీమారంతో పాటు తాళ్లగూడెం, అంకుసాపూర్ గ్రామాల మీదుగా సోమవారం మధ్యాహ్నం ఓ హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. పలుమార్లు భూమి సమీపానికి వచ్చింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు బయటకు వచ్చి హెలికాప్టర్‌ను చూశారు. దాదాపు గంటపాటు ఇళ్లపై నుంచే చక్కర్లు కొట్టి మంథని వైపు వెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హెలికాప్టర్ ఇళ్ల సమీపం నుంచి వెళ్లడంతో ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా, ఎస్సై రాములును సంప్రదించగా.. హెలికాప్టర్ గురించి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. ఈ విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లామని పేర్కొన్నారు.

ఎండల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ సుబ్బరాయుడు

వేమనపల్లి: ఎండలు పెరుగుతుండడంతో ప్రమాదం పొంచి ఉందని, పలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుబ్బరాయుడు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. చేశారు. సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఉపాధిహామీ పనుల స్థలాలు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలకు అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని, ఎండ వేడికి తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు సూచించారు. వడదెబ్బ బారిన పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వేసుకోవాల్సిన దుస్తువులపై వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డులు అప్‌డేషన్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా అంకితభావంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్, హెల్త్ అసిస్టెంట్ ఆర్.బాపు, లింగన్న, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, రాజేశ్వరి, మంజుల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంకు మోక్షమెప్పుడో..!

- నిధులు వచ్చి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణంలో జాప్యం
- జిల్లా ఏర్పడినా ముందడుగు పడని వైనం
- జిల్లా నుంచి వివిధ క్రీడల్లో రాణిస్తున్న వారెందరో..
- ఖేలో ఇండియా స్కీంలో బాక్సింగ్ క్రీడ ఎంపిక



జెడ్పీ మైదానంలో స్టేడియం పనులు ప్రారంభించి కోర్టు కేసుతో నిలిపివేసిన ప్రాంతం



స్టేడియం నిర్మాణానికి జెడ్పీ మైదానం చివరలో అనుకూల ప్రదేశం

మంచిర్యాలటౌన్: జిల్లాలో క్రీడాకారులకు కొదువ లేదు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వివిధ రకాల క్రీడలు, అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నా స్టేడియం నిర్మాణంలో ముందడుగు పడడం లేదు. ఉమ్మడి జిల్లాలోనే మంచిర్యాల తూర్పు జిల్లా కేంద్రంగా ఉండేది. 2014లోనే అప్పటి ప్రభుత్వం మంచిర్యాలలో వెయ్యి గజాల్లో మినీ స్టేడియం ఏర్పాటుకు రూ.2.60 కోట్లు విడుదల చేసింది. బస్టాండ్ పక్కనే జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలోని స్థలాన్ని కూడా కేటాయించారు. పనులు ప్రారంభించి పిల్లర్లు వేస్తున్న దశలో పాఠశాల పేరెంట్స్ కమిటీ కోర్టుకు వెళ్లగా.. స్టే ఆర్డర్‌తో పనులకు బ్రేక్ పడింది. ఆ తర్వాత మరోచోట స్థలాన్ని ఎంపిక చేయకపోవడం, ప్రత్యామ్నాయ మార్గాలు చూడకపోవడంతో పదేళ్లుగా నిధులు మూలుగుతున్నాయి. చాలామంది క్రీడల్లో రాణిస్తున్నా సరైన సౌకర్యాలు, మైదానాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏవైనా రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించాలంటే జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో తాత్కాలికంగా క్రీడల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఏదో ఒక పాఠశాలలో వసతి కల్పించాల్సి వస్తోంది. స్టేడియం నిర్మాణం పూర్తయితే అవసరమైన క్రీడాకోర్టులతోపాటు క్రీడాకారుల బసకు గదులు అందుబాటులోకి వస్తాయి. జెడ్పీ మైదానంలో చివర ఉన్న ప్రదేశం స్టేడియం నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని క్రీడాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవి..

కోల్‌బెల్ట్ ప్రాంతం కావడం, అడవులు, పారిశ్రామిక ప్రాంతాలు, పల్లె, పట్టణాల కలబోతతో జిల్లా వ్యాపించి ఉంది. పల్లె, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్ వంటి ఎన్నో క్రీడల్లో క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. క్రీడా మైదానాలు, స్టేడియం వంటివి లేకపోయినా పలువురు క్రీడల్లో ప్రతిభను చాటుతున్నారు. 1997లో లక్సెట్టిపేటకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరైనా రాజకీయ జోక్యంతో ఆదిలాబాద్‌కు తరలించారు.

శిక్షణకు కష్టంగా ఉంది



జిల్లాకు ఒక స్టేడియం గానీ మైదానం గానీ లేకపోవడంతో క్రీడల్లో శిక్షణకు, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణ కష్టంగా ఉంది. స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తే అన్ని రకాల క్రీడలు నిర్వహణకు అవకాశం ఉంటుంది. స్టేడియంలో 20 గదుల నిర్మాణంతో ఇతర ప్రాంతాల నుంచి క్రీడల్లో పాల్గొనే వారు వచ్చినప్పుడు వారు ఉండేందుకు అవకాశం ఉంటుంది.

– వనిత, ఫుట్‌బాల్ కోచ్, బెల్లంపల్లి

నిధులు వినియోగించలేని పరిస్థితి



జిల్లాకు ఖేలో ఇండియా స్కీంలో బాక్సింగ్ క్రీడను ఎంపిక చేశారు. 30 మంది విద్యార్థులకు బాక్సింగ్ ఉచితంగా శిక్షణ అందిస్తున్నాం. బాక్సింగ్ కోసం స్టేడియంలో ఒక హాల్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పిల్లలకు బాక్సింగ్ నేర్పించేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు రూ.7లక్షలు కేంద్రం విడుదల చేసింది. స్టేడియం లేకపోవడం, బాక్సింగ్ హాల్ లేకపోవడంతో ఆ నిధులు వినియోగించుకోలేకపోతున్నాం.

– రాజేశ్, బాక్సింగ్ కోచ్, మంచిర్యాల

నిధులు వచ్చినా నిష్ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా పేరిట జిల్లాలో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడల కోసం నిధులు విడుదల చేస్తోంది. క్రీడల కోసం జిల్లా కేంద్రంలో కనీసం 10 నుంచి 15 ఎకరాల స్థలం ఉండాలి. అప్పుడే అందులో స్టేడియం నిర్మాణంతోపాటు వివిధ క్రీడల నిర్వహణకు అవసరమైనవి ఏర్పాటు చేసుకోవచ్చు. 15 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే స్టేడియం నిర్మాణంతోపాటు అథ్లెటిక్స్ కోసం సింథటిక్ ట్రాక్, వాలీబాల్, హ్యాండ్‌బాల్ కోర్టులు, ఇతర క్రీడల కోసం అవసరమైన ఏర్పాట్లకు అవకాశం ఉంది. జిల్లాకు క్రీడల కోసం స్థలం కేటాయింపు లేకపోవడంతో కేంద్రం నుంచి ఖేలో ఇండియా ద్వారా రూ.7 లక్షలు వచ్చినా ఖర్చు చేయలేని పరిస్థితి. క్రీడలను ప్రోత్సహించాలన్నా, క్రీడాకారులను తయారు చేయాలన్నా స్టేడియంతోపాటు క్రీడలకు స్థలాన్ని కేటాయించాలని క్రీడా సంఘాలు కోరుతున్నాయి.

మిల్లుల ట్యాగింగ్ గందరగోళం

- హడావుడి కేటాయింపులతో ఇబ్బందులు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: వరి ధాన్యం సేకరణలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా యి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తూకం, మిల్లుల ట్యాగింగ్ లేక రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎమ్మెస్, మెప్మా ఏజెన్సీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఒక్క ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభించడం గమనార్హం. కానీ కేంద్రమే ఏర్పాటు చేయని పీఏసీఎస్‌కు మిల్లులకు ట్యాగింగ్ చేశారు. కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం సేకరించడం లేదని, రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందని, అకాల వర్షాలతో నష్టపోయే పరిస్థితి నెలకొందని పత్రికల్లో వస్తున్న కథనాలతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కేంద్రాలకు మిల్లులు ట్యాగింగ్ చేశారు. నెన్నెల మండలం అవుడం, చిత్తపూర్, గుండ్లసోమారం, మైలారంలో ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేసినా మిల్లు ట్యాగింగ్‌లు ఇవ్వలేదు. డీసీఎంఎస్ కేంద్రాలకు మాత్రం మిల్లు ట్యాగింగ్ ఇచ్చారు. జిల్లాలో 262 కొనుగోలు కేంద్రాల నుంచి 2 వేల మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం 19 బాయిల్డ్ రైస్‌మిల్లులకు ట్యాగింగ్ చేశారు. మొదటి ఫేజ్ కింద ఒక్కో మిల్లుకు 2 వేల మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం తరలింపునకు కేటాయించారు. 52,400 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాలని నిర్ణయించారు. సాంకేతిక సమస్యల వల్ల తూకం వేయడంలో ఆలస్యం జరుగుతోందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- అధికారులతో సమావేశం

మంచిర్యాలఅగ్రికల్చర్: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యలతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, మెప్మా, ఏపీఎం, ఇంజినీరింగ్ విభాగం అధికారులకు అభివృద్ధి పనుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం, చిన్న, పెద్ద మరమ్మతులు చేపట్టడం, ఇప్పటికే ఉన్న, పనిచేయని మూత్రశాలల పునరుద్ధరణ, నిర్వహణ, తరగతి గదుల విద్యుద్దీకరణ, పాఠశాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు సోలార్ ప్యానళ్ల ఏర్పాటు లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పని చేస్తుందని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం గుడిపేట, రాపల్లి, దొనబండ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 262 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీఆర్‌డీఓ కిషన్, పౌరసరఫరాల శాఖా జిల్లా మేనేజర్ గోపాల్, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, గిర్దావర్ ప్రభు పాల్గొన్నారు.



దొనబండ కొనుగోలు కేంద్రంలో ఐకేపీ నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

కనీస మద్దతు కల్పించేందుకే..

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులకు కనీస మద్దతు కల్పించేందుకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయని రైస్‌మిల్లులపై రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయాలి

మందమర్రిరూరల్: జిల్లాలోని రైస్‌మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్‌తో కలిసి మందమర్రి పట్టణంలోని వెంకటేశ్వర రైస్‌మిల్, వాసవి రైస్‌మిల్, ఆదిల్‌పేట్‌లోని నీలం బ్రదర్స్ రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వరిధాన్యం పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి రాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వడ్డీ దందాలపై పోలీసుల కొరడా

- ఫైనాన్స్, చిట్టీ, వడ్డీ వ్యాపారులపై వరుస దాడులు
- నాయకుల ఫోన్లతో పోలీసులకు తలనొప్పిగా మారిన వైనం

మంచిర్యాలక్రైం: వడ్డీ వ్యాపారులపై పోలీసులు వరుస దాడులు నిర్వహిస్తూ కొరడా ఝళిపిస్తున్నారు. జిల్లాలో అనుమతి లేని వడ్డీ వ్యాపారులు, చిట్టీల నిర్వాహకుల ఇళ్లు, ఫైనాన్స్‌ల్లో గత మూడు రోజులుగా దాడులు నిర్వహిస్తున్నారు. దీంతో కొందరు రాజకీయ పలుకుబడి కలిగిన ఫైనాన్స్, వడ్డీ వ్యాపారులు నాయకులతో ఫోన్లు చేయిస్తుండడం పోలీస్ అధికారులకు తలనొప్పిగా మారింది. వడ్డీ వ్యాపారులు సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అందిన కాడికి దోచుకుంటున్నారని, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించేక కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పోలీస్ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐజీ రంగనాథ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. వ్యాపారుల వద్ద కుదువబెట్టిన విలువైన బంగారం, డాక్యుమెంట్లు, చెక్కులు, నగదు స్వాధీనం చేసుకుంటున్నారు. సంబంధిత వ్యాపారులపై కేసు నమోదు చేసి డాక్యుమెంట్లు, చెక్కులు, బంగారం కోర్టులో అందజేయడం, నగదు ఇన్‌కం టాక్స్ అధికారులకు అప్పగించడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మంచిర్యాల పట్టణంలోని ఎస్‌కే ఫైనాన్స్‌లో సోమవారం స్థానిక సీఐ బన్సీలాల్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రూ.7,64,000 నగదు, 67 ప్రామిసరి నోట్లు, 16 ఖాళీ చెక్కులు, రిజిష్టర్ సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

కాసిపేటలో..

కాసిపేట: మండల కేంద్రంలోని పలువురు అక్రమ వడ్డీ, చిట్టీ, ఫైనాన్స్ వ్యాపారులపై సోమవారం సాయంత్రం ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. ముత్యంపల్లిలోనూ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్న ఇంగు నారాయణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఖాళీ ప్రామిసరి నోట్లు, సంతకాలతో కూడిన చెక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



మంచిర్యాలలోని ఫైనాన్స్‌లో తనిఖీలు

చెన్నూర్‌లో..

చెన్నూర్: అధిక వడ్డీ వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న వడ్డీ వ్యాపారులపై మూడు పోలీసు బృందాలు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. చెన్నూర్ పట్టణంలో అనుమతి లేకుండా చిట్టీలు, వడ్డీ వ్యాపారం చేస్తున్న పలు షాపులపై దాడులు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్న మామిడాల లక్ష్మీనారాయణ ఎలాంటి అనుమతి లేకుండా చిట్టీ వ్యాపారంతోపాటు బ్లాంక్ చెక్కులు తీసుకుని అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడని తెలిపారు. ఐదు బ్లాంక్ చెక్కులతోపాటు రిజిష్టర్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. దాడుల్లో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, జైపూర్ ఎస్సై శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో బడులకు భద్రత ఎలా..?



దొంగలు పడిన న్యూగర్మిళ్ల పాఠశాల ఇదే..

- విలువైన సామగ్రికి దిక్కెవరు
- తాత్కాలిక వాచ్‌మెన్ నియామకంపై సందిగ్ధత

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విలువైన సామగ్రికి భద్రత కరువైంది. వాచ్‌మెన్‌లు లేకపోవడంతో రక్షణ లేకుండా పోతోంది. ఈ నెల 24నుంచి వేసవి సెలవులు మొదలై జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఒకట్రెండు రోజులు సెలవులు వస్తేనే పాఠశాలల్లో ఆకతాయిల చేష్టలతో విలువైన వస్తువులు ధ్వంసం అవుతున్నాయి. ఇక వేసవి సెలవుల్లో రక్షణ ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మన ఊరు–మనబడి, పట్టణ ప్రాంతాల్లో మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద 245 పాఠశాలలు ఎంపిక చేసి ఆధునిక హంగులు కల్పించారు. మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సిస్టమ్స్, డ్రికింగ్ వాటర్ సిస్టమ్స్, సోలార్ పీవీ సిస్టమ్స్, డైనింగ్ హాల్స్ పర్నిచర్, ఐఎఫ్‌పీఎస్, డ్యూయల్ డెస్క్‌లు, పాఠశాలలకు పెయింటింగ్, గ్రీన్ చాక్ బోర్డులు వంటి సౌకర్యాలు సమకూర్చారు. గతేడాది పనులు పూర్తి చేసిన ప్రతీ పాఠశాలలో పగలు, రాత్రి వాచ్‌మెన్‌ను నియమించారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే వరకు తాత్కాలిక పద్ధతిన కొనసాగించారు. ఈ ఏడాది తాత్కాలిక వాచ్‌మెన్‌ల ఏర్పాటుపై ఎటూ తేల్చకపోవడంతో పాఠశాల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

గతేడాది ఇలా..

పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా డే, నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేశారు. గత పనితీరు, పూర్వాపరాలు, ట్రాక్ రికార్డ్ ఆధారంగా కాపలాదారుని తాత్కాలిక పద్ధతిన విధుల్లోకి తీసుకున్నారు. నెలకు రూ.5వేలు గౌరవ వేతనం చెల్లించాలని ఆదేశాలు వచ్చాయి. వాచ్‌మెన్ పగలు, రాత్రి కాపలాతోపాటు ఏఎఫ్‌పీల ఇన్‌స్టాలేషన్, బ్యాటీర్ ఆఫ్ ట్యాప్, డ్యూయల్ డెస్క్‌లు, డ్రికింగ్, సోలార్ ప్యానల్ల తోపాటు మొక్కలకు నీరు పెట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణలో క్రమం తప్పకుండా చూడడం, అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా బాధ్యతలు అప్పగించారు.

- న్యూగర్మిళ్ల పాఠశాలలో హోలీ పండుగ సెలవుల్లో దొంగలు పడ్డారు. కిటికీ ఇనుప చువ్వలు తొలగించి తాపీగా వెళ్లి కోడిగుడ్ల ఆమ్లెట్ వేసుకుని తిన్నారు. నిత్యావసర సరుకులు చిందరవందర పడేశారు. మధ్యాహ్న భోజనానికి దాతలు అందించిన 120 ప్లేట్లు ఎత్తుకెళ్లారు. విద్యుత్ వైరింగ్ కట్ చేశారు. టీవీని ప్యాక్ చేసి వెళ్లిపోయారు.
- సంక్రాంతి సెలవుల్లో భీమారం పాఠశాలలో వాటర్‌ట్యాంకు, ట్యూబ్‌లైట్లు, ఇతర సామగ్రిని ఆకతాయి ధ్వంసం చేశారు.

ఆదేశాలు రాలేదు

సెలవుల్లో తాత్కాలిక వాచ్‌మెన్‌ల నియామకంపై ఇంకా ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం. ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం.

– యాదయ్య, డీఈవో

వరి పంట కోత ప్రయోగం



దిగుబడిని పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో స్థానిక రైతు బెంబడి గురువయ్య సాగు చేసిన వరి పంటను సోమవారం రాష్ట్ర అర్థగణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ పి.రవీందర్‌రెడ్డి, ఉపగణాంక అధికారి డి.శ్రీకాంత్, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి జి.సత్యం, జిల్లా వ్యవసాయాధికారి జి.కల్పన పరిశీలించారు. పంట పొలంలో ఐదు మీటర్ల పొడువు, ఐదు మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం చేశారు. పంట కోత ద్వారా మొత్తం 19.855 కిలోగ్రాముల ధాన్యం దిగుబడి వచ్చిందని గుర్తించారు. వరిపంట దిగుబడిని అంచనా వేసుకుని పంట సాగుకు జాగ్రత్తలు తీసుకుని అధిక దిగుబడి సాధించేలా రైతులు కృషి చేయాలని అన్నారు. ఈ కా ర్యక్రమంలో హాజీపూర్ మండల వ్యవసాయాధికారి మార్గం రజిత, జిల్లా ఉప గణాంక అధికారి ఎస్.పాపయ్య, మండల ప్రణా ళిక, గణాంక అధికారి పి.రమేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి కనకరాజు పాల్గొన్నారు.

రవాణా శాఖ సర్వర్ బిజీ

- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- వరుస సెలవులతో డీటీఓ కార్యాలయంలో రద్దీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని జిల్లా రవాణా శాఖా కార్యాలయం వాహనదారులతో కిటకిటలాడింది. వరుసగా సెలవులు రావడంతో సోమవారం వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర కార్యకలాపాల కోసం భారీ సంఖ్యలో వచ్చారు. గత వారంలో రెండ్రోజులు పని దినాలు ఉండగా.. మిగతా నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో దాదాపు 300 వరకు వివిధ కార్యకలాపాల కోసం స్లాట్‌లు బుక్ చేసుకున్న వారు రావడంతో ఆర్టీఓ కార్యాలయ పరిసరాల్లో రద్దీ ఏర్పడింది. మధ్యాహ్నం 12 గంటల వరకు నెట్‌వర్క్ సమస్య తలెత్తడం, ఆపై సర్వర్ బిజీగా ఉండడంతో స్లాట్ బుక్ చేసుకున్న వారి పనులు ముందుకు సాగక ఇబ్బందులకు గురయ్యారు. గంటన్నరపాటు నిరీక్షించి వాహనదారులు తమ పనులు పూర్తి చేసుకున్నారు. ఇక నిన్నటి వరకు రెండు కౌంటర్లు మాత్రమే ఉండగా జిల్లా రవాణా శాఖా అధికారులు సోమవారం అదనంగా మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి వాహనదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు.



డీటీఓ కార్యాలయంలో వాహనదారుల రద్దీ

987 టీజీ సిరీస్ నంబర్లు జారీ..

కొత్తగా ఇప్పుడు తెలంగాణలో టీజీ సిరీస్ నడుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ సిరీస్‌తో వాహనాలు ఉండగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో టీఎస్ సిరీస్ అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో టీఎస్‌ను టీజీ సిరీస్‌గా మార్చిన విషయం తెలిసిందే. టీజీ సిరీస్ గత మార్చి నెల 15 నుంచి అమలులోకి రాగా ఇప్పటివరకు 987 వాహన నంబర్లను జారీ చేశారు. ఇందులో 657 మోటార్ సైకిళ్లు, 121 కార్లు ఉండగా మిగిలిన 209 వివిధ రకాల వాహనాలు ఉన్నాయి. వాహన నంబర్ ప్లేట్లను ప్రస్తుతం వాహన షోరూంల ద్వారా అమరుస్తున్నారు. ఇంకా ఎవరూ టీజీ సిరీస్‌తో నంబర్ ప్లేట్లను బిగించుకోకపోవడం గమనార్హం. టీజీ సిరీస్‌తో వచ్చే హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు షోరూంలకు సరఫరా కావడం లేదు. అందుకే బిగింపు నెమ్మదిగా సాగుతోంది.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన ఎండీ ముబాషిర్ గ్రామంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించేందుకు నిల్వ చేశాడని సమాచారం అందిందన్నారు. ఆదివారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎండీ ముబాషిర్‌పై కేసు నమోదు చేసిన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని పేర్కొన్నారు. సిబ్బంది మధు, సంజీవ్, రమేశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

16మందిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న ఓ హోటల్ వద్ద ఈ నెల 13న రాత్రి 11.30గంటలకు జరిగిన దాడి ఘటనలో 16మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు ఒకరిపైనొకరు దాడి చేసుకోగా.. స్థానిక రాళ్లపేటకు చెందిన సద్దాం తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దాడులకు పాల్పడిన రెండు వర్గాలకు చెందిన 16మందిని గుర్తించామని తెలిపారు. సోమవారం తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మరో ఏడుగురిని పట్టుకునేందుకు మూడు బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు.

విద్యుత్‌వైరు తెగిపడి మూడెడ్లు మృతి


మృతిచెందిన ఎద్దులు

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామంలో విద్యుత్ వైరు తెగిపడడంతో మూడు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మడావి సీతారాం, పెందూర్ జంగు, పెందూర్ శంభు కు చెందిన ఎద్దులు సోమవారం ఉదయం మేతకోసం వెళ్లగా పంటపొలంలో 11 కేవీ విద్యుత్ వైర్ తెగిపడడంతో మృతి చెందాయి. ఒక్కో ఎద్దు విలువ సుమారు రూ.55 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా ఏటా మూగజీవాలు మృతి చెందుతున్నాయని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు, మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్ ఆరోపించారు. బాధిత రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

వినోదం.. వికాసం.. విజ్ఞానం

- పీఎంశ్రీ పథకానికి బెల్లంపల్లి సీఓఈ విద్యాలయం ఎంపిక
- విజ్ఞానయాత్రకు నిధులు సమకూర్చిన కేంద్ర ప్రభుత్వం
- వరంగల్ జిల్లా టూర్‌కు వెళ్లి వచ్చిన విద్యార్థులు


వేయి స్తంభాల గుడి వద్ద విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యాలయం ప్రతిభావంతంగా రాణిస్తోంది. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన, పచ్చదనం, పరిశుభ్రత, నీటి లభ్యత, క్రమశిక్షణ ఇతరత్రా అంశాల్లోనూ ప్రత్యేకతను చాటుకుంటోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి ఎంపికై సత్తా చాటింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 17సంక్షేమ బాలబాలికల గురుకులాలు ఉండగా వీటిలో నుంచి బెల్లంపల్లి సీఓఈ బాలుర, బోథ్, లక్సెటిపేట బాలికల గురుకుల విద్యాలయాలు ఎంపికయ్యాయి.

దర్శనీయ స్థలాల సందర్శన

పీఎంశ్రీ ప్రభుత్వ ప్రయోజిత పథకం. ప్రత్యేక నిధులు సమకూర్చి విద్యార్థుల మానసిక ఉన్నతిని పెంపొందించడం ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా విజ్ఞానయాత్ర నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 13వరకు తరగతుల వారీగా సీఓఈ విద్యార్థులను రాష్ట్రంలోని ప్రఖ్యాత దర్శనీయ స్థలాలకు తీసుకెళ్లారు. 5, 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా వరంగల్ జిల్లాలోని రీజినల్ సైన్స్ సెంటర్, కాకతీయుల కోట, చారిత్రాత్మక వేయిస్తంభాల గుడి, సైన్స్ మ్యూజియం, రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, భద్రకాళీ, పద్మాక్షి దేవాలయాలు తదితర చూపించి విజ్ఞానాన్ని అందించారు. విజ్ఞానయాత్రకు వెళ్లి వచ్చిన విద్యార్థులు తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. విద్యార్థుల మాటల్లోనే..

థ్రిల్ అయ్యాను



రామప్ప దేవాలయం పేరు వినడమే తప్పా ఇంతవరకు ప్రత్యక్షంగా చూడలేదు. విజ్ఞానయాత్ర వల్ల ఆ ఆలయాన్ని చూసే భాగ్యం కలిగింది. ఆ కట్టడం ఎంతో అద్భుతంగా ఉంది. 1173 నుంచి 1210 వరకు దాదాపు 40 ఏళ్లపాటు కాకతీయ రాజులు నిర్మించారని చెప్పారు. శిల్పి రామప్ప పేరుమీద గుడిని పిలవడం గొప్ప విషయం. రామప్ప గుడికి యూనెస్కో గుర్తింపు రావడం అరుదైన గౌరవం.

– వరమని సాయి ప్రజ్ఞాన్, 9వ తరగతి

సైన్స్ సెంటర్ ఆకట్టుకుంది



సైన్స్ ఎంత గొప్పదో తెలుసుకున్నాను. సైన్స్ వల్ల మానవ జీవితం ఎంతగా ప్రభావితం అవుతున్నదో ప్రత్యక్షంగా పరిశీలించాను. శాస్త్రజ్ఞులు చేసిన సైన్స్ ప్రయోగాలు, వాటి తాలూకు ఫలితాలను అడిగి తెలుసుకుని చాలా ఉత్తేజితున్ని అయ్యాను. ఒక్కో ప్రయోగం నమూనాలను పరిశీలించడం వల్ల శాస్త్రవేత్తల మేధో సంపత్తి ఏపాటిదో, ఆ ప్రయోగాల కోసం ఎంతగా పరితపించారో తెలుసుకోగలిగాను.

– బన్న అద్విక్, 8వ తరగతి

జీవావరణంపై అవగాహన కలిగింది



జంతు ప్రదర్శన శాలను సందర్శించడం వల్ల జంతువులు, మనుషులకు మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాల గురించి అవగాహన కలిగింది. జంతు ప్రదర్శన శాల ప్రకృతి రమణీయతకు అద్దం పట్టింది. ప్రకృతి ఎంత అందంగా ఉంటుందో, సకల చరాచర జీవులను ప్రకృతి ఎంతగా కాపాడుతోందో కొంతలో కొంత తెలుసుకోగలిగాను. ప్రకృతిని కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– పుల్లూరి రక్షిత్, 7వ తరగతి

ఆకట్టుకున్న వేయి స్తంభాల గుడి



వరంగల్‌లో కాకతీయుల రాజుల కోట నాటి వైభవానికి దర్పణం పట్టింది. వందల ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన కోట అద్భుతమైన శిలాసంపదకు నెలవుగా ఉంది. కళానైపుణ్యం ఎంతగానో ఆకట్టుకుంది. వేయి స్తంభాల గుడి మరో ప్రత్యేకత. ఆయా చారిత్రక కట్టడాల విశిష్టత, కాకతీయుల కాలంలో సైనికుల ధైర్యసాహసాలు ఎంత గొప్పవో చూడగలిగాను. విజ్ఞానయాత్ర నాకు ఎన్నటికీ గుర్తుండి పోతుంది.

– పోతల విరాజ్, 6వ తరగతి

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని కలిగించింది



పీఎంశ్రీ పథకానికి సీఓఈ విద్యాలయం ఎంపిక కావడం వల్ల విద్యార్థులు దర్శనీయ స్థలాలకు వెళ్లడానికి అవకాశం కలిగింది. ఇలాంటి విజ్ఞానయాత్ర వల్ల విద్యార్థులు ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకోగలుగుతారు. ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుంటుంది. పాఠ్య పుస్తకాల్లోని చారిత్రాత్మక అంశాలను చదువుకోవడంతోనే సరిపోదు ప్రత్యక్షంగా చూడడం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం వికసిస్తుంది. విద్యార్థులు ఎంతో కొంత విజ్ఞానాన్ని పొందారు.

– ఐనాల సైదులు, సీఓఈ ప్రిన్సిపాల్, బెల్లంపల్లి

చిన్నబుగ్గ గుట్టకు కార్చిచ్చు


చిన్నబుగ్గ గుట్టపైన వ్యాపిస్తున్న పొగలు

బెల్లంపల్లి మున్సిపల్ కాల్‌టెక్స్ ఏరియా వెనకాల ఉన్న చిన్నబుగ్గ గుట్టపై కార్చిచ్చు చెలరేగింది. ఎత్తయిన గుట్టపై ఎండ తీవ్రత వల్ల ఆకస్మికంగా మంట అంటుకున్నట్లుగా తెలుస్తోంది. దీంతో గుట్టపై దట్టమైన పొగలు వస్తున్నాయి. గుట్టపై ఏర్పడిన పొగలు చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎంతో ఎత్తులో ఉన్న గుట్టపైన కార్చిచ్చు అంటుకోవడం వల్ల మంటలను ఆర్పేసే అవకాశాలు లేకుండా ఉన్నాయి.

– బెల్లంపల్లి

మిస్టరీగా ఫైనాన్స్ వ్యాపారి మరణం..?

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఓ బడా ఫైనాన్స్ వ్యాపారి మరణం మిస్టరీగా మారింది. వారం రోజుల క్రితం మృతిచెందగా.. సర్వత్రా చర్చ జరుగుతోంది. సాధారణ మరణమంటూ కుటుంబ సభ్యులు కార్యక్రమాలు పూర్తి చేశారు. వారం రోజుల తర్వాత మృతిపై అనుమానాలు వ్యక్తం కావడం, పలువురు చర్చించుకోవడంతో పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. సదరు వ్యాపారి ఫైనాన్స్ వ్యాపారంలో నెలకు రూ.కోటి వరకు లావాదేవీలు నిర్వహిస్తుండేవాడు. ఆయన వద్ద ఫైనాన్స్ తీసుకుని పలు వ్యాపారులు చేసుకున్న వారు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యాపారికి జిల్లా కేంద్రంలో ఓ ముగ్గురు వ్యక్తులు అతి సన్నిహితంగా ఉండేవారు. ఇందులో ఒకరి వద్ద మృతికి సంబంధించిన కారణాలు పూర్తి వివరాలతో కూడిన ఉత్తరం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆయన మృతికి ముందు వారం రోజులు ఓ వ్యక్తితో వరుసగా మద్యం సేవించడం, ఆ సమయంలో సుమారు రూ.కోటి వరకు ఆయన వద్దనే దాచి ఉంచినట్లు సమాచారం. సదరు వ్యాపారిది సాధారణ మరణమా..? లేక ఏమైనా జరిగి ఉంటుందా..? అని చర్చించుకుంటున్నారు. పోలీసులు సమగ్ర విచారణ చేస్తే మరణం వెనుక ఉన్న మిస్టరీ వీడే అవకాశం ఉంది. కాగా, ఈ విషయంలో ఇప్పటికే పోలీసులు కొందరిని విచారించినట్లు విశ్వసనీయ సమాచారం.

మహిళల పట్ల లైన్‌మెన్ అసభ్య ప్రవర్తన

జన్నారం: కరెంటు బిల్లుల వసూళ్ల పేరుతో ఓ లైన్‌మెన్ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడం వెలుగులోకి వచ్చింది. మండలానికి చెందిన ఓ లైన్‌మెన్ రాత్రి పూట ఫోన్ చేసి కరెంటు బిల్లు కట్టవా అని మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కవ్వాల్ గ్రామంలో రెండు నెలల క్రితం ఓ మహిళతో రాత్రి పది గంటల సమయంలో కరెంటు బిల్లు గురించి మాట కలిపి అసభ్యకరంగా మాట్లాడినట్లు ఆరోపణలు రావడంతో ఆయన్ను నిలదీసి మధ్యవర్తి ద్వారా క్షమాపణలు చెప్పించినట్లు తెలిసింది. మరో మహిళ పట్ల కూడా ద్వందర్థాలు వచ్చేలా మాట్లాడగా, కుటుంబీకులు హెచ్చరించి వదిలేసినట్లు తెలిసింది. రెండ్రోజుల క్రితం మండలంలోని పొనకల్‌కు చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా మాట్లాడి చేయి పట్టుకోవడంతో ఆమె ఆగ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపింది. మధ్యవర్తులు సదరు లైన్‌మెన్‌తో మహిళ కాళ్లు మొక్కించి వదిలేశారని తెలిసింది. లైన్‌మెన్‌కు ఇక్కడ పోస్టింగ్ లేకున్నా డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాడు. సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సదరు లైన్‌మెన్‌ను ఫోన్‌లో సంప్రదించగా తనకెలాంటి సంబంధం లేదని, కావాలని ఆరోపణలు చేస్తున్నారని తెలిపాడు.

బిల్లు రాలేదని స్కూల్ గేటుకు తాళం


గేటుకు తాళం వేయడంతో స్కూల్ బయట విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: పాఠశాల భవన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదని కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు జెడ్పీ ఉన్నత పాఠశాల గేటుకు సోమవారం సంబంధిత కాంట్రాక్టర్ తాళం వేశాడు. మన ఊరు– మన బడి పథకం కింద రూ.97 లక్షలతో కాంట్రాక్టర్ హబీబ్ పాఠశాల భవనం నిర్మించారు. పనులు పూర్తయి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాలేదు. విసిగిపోయిన కాంట్రాక్టర్ సోమవారం ఉదయం స్కూల్ గేటుకు తాళం వేశాడు. సోమవారం నుంచే విద్యార్థులకు ఎస్ఏ– 2 పరీక్షలు ప్రారంభం కావడంతో సుమారు గంట సేపు పాఠశాల వద్దే పడిగాపులు కాశారు. విషయం తెలుసుకున్న అధికారులు మూడు రోజుల్లో బిల్లులు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ గేటు తాళం తీశాడు.

'ఉపాధి'లో నారీలోకం

- అధికంగా పాల్గొంటున్న మహిళలు
- గ్రూపులుగా ఏర్పడి పనులు

దండేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో మహిళా లోకం సత్తా చాటుతోంది. భారీ సంఖ్యలో పాల్గొంటూ ఆదర్శనంగా నిలుస్తోంది. కొన్నేళ్ల క్రితం వరకు పలుగు, పార చేతబట్టి వ్యవసాయ కూలీలుగా పొలంబాట పట్టిన మహిళలు నేడు ఉపాధి హామీ పథకం పనుల్లో మేము సైతం అంటున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో కందకాల తవ్వకాలు, కాల్వలు, చెరువుల పూడికతీత, ఫిష్‌పాండ్‌లు, కుంటల నిర్మాణం, ఫాంపాండ్ వంటి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో పురుషుల కంటే రెట్టింపు సంఖ్యలో మహిళలు భాగస్వామ్యం అవుతున్నారు. ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకపోవడం, పనివేళలు అనువుగా ఉండడం, స్థానికంగానే పనులు లభిస్తుండడం, పనులు సులువుగా ఉండడంతో ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మొత్తం 1,20,536 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో పనిచేసే కుటుంబాలు 63,314 ఉండగా, 42,వేల మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఇందులో మహిళా కూలీలు 29 వేలు, పురుష కూలీలు 13వేల మంది పనిచేస్తున్నారు. అంటే పురుషుల కంటే 16 వేల మంది మహిళలు ఎక్కువగా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు.


ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

మహిళలకు వరం..

ఉపాధి హామీ పథకం పనులకు మొదట పురుషులే ఎక్కువగా వెళ్లేవారు. క్రమక్రమంగా మహిళలు కూడా వెళ్తున్నారు. పొదుపు కోసం ఏర్పాటైన మహిళా సంఘాల సభ్యులు గ్రూపులుగా ఏర్పడి ఉపాధి పనులు చురుగ్గా చేస్తున్నారు. ఏడాదిలో వంద రోజులపాటు ఈ పథకం కింద ఉపాధి పొందుతున్న మహిళా కూలీలు ప్రభుత్వం చెల్లించే కూలీ డబ్బులను వివిధ అవసరాలకు వినియోగించుకుని సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఏడాది దినసరి కూలీ రూ.272 ఉండగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.300 చెల్లిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


కలెక్టరేట్‌కు వచ్చిన ఐకేపీ గ్రూప్ సభ్యులు, రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: కన్నెపెల్లి మండలం మిట్టపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2006 నుంచి వడ్లు కొనుగోలు చేస్తున్నారని, ఈ సంవత్సరం కొనుగోలు కేంద్రాల మొదటి జాబితాలో లేదని తెలిపారు. యాసంగి వరి సాగు విస్తీర్ణం 2వేల ఎకరాలు పీపీరావు ప్రాజెక్టు, బోరు బావుల కింద సాగు చేస్తున్నామని, దిగుబడి వస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రం లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని కోరారు.

పెద్దపల్లి ఎన్నికల ఇంచార్జిగా ప్రభాకర్


మాట్లాడుతున్న ప్రభాకర్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జిగా బెల్లంపల్లికి చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభాకర్‌కు కాంగ్రెస్ శ్రేణులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్లేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, పలు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వలసలు ఆగేదెలా?

- బీఆర్ఎస్ నుంచి కొనసాగుతున్న జంపింగ్స్
- నేడు ఆదిలాబాద్‌కు కేటీఆర్ రాక
- పార్లమెంట్ సెగ్మెంట్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర పడుతోంది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి వలసలు ఆగడం లేదు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంపింగ్స్ కొనసాగుతున్నాయి. మొన్నటి వరకు ముఖ్యనేతలు కారు మార్చగా, ఇప్పుడు ద్వితీయ శ్రేణి నాయకుల వంతు వచ్చింది. ఈ పరిస్థితుల్లో వలసలు ఆగేదెలా అనే తర్జనభర్జన పార్టీలో సాగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరగనుంది.

ఇదీ పరిస్థితి..

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ క్రమంగా ఢీలా పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ పార్టీ నుంచి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ముఖ్యనేతలు మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, విఠల్‌రెడ్డి ఇది వరకే కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి ఐకేరెడ్డి కూడా చేరుతారనే ప్రచారం ఉంది. ఇదిలా ఉంటే తాజాగా నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలోనే వారు హస్తం గూటికి చేరనున్నారు. వీరితో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారన్న ప్రచారం ఉంది. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బీజేపీలోకి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్‌లోకి ఇది వరకే పార్టీ మారారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల్లో పార్టీ బలహీన పడింది. పార్లమెంట్ అభ్యర్థిగా ఆత్రం సక్కు పార్టీ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. బూత్ స్థాయిలో కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు కేటీఆర్ పర్యటన తోడ్పడుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


రైల్వేస్టేషన్‌లో వాల్‌పోస్టర్లు పంపిణీ

మంచిర్యాలక్రైం: జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. జిల్లా ఫైర్ అధికారి అజయ్‌బాబు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ దేవేందర్, భీమయ్య, మల్లయ్య, నరేష్, అనిల్, రాజేశం, రాజేందర్, రవి, ఎండీ గఫార్, మహేందర్, కమలాకర్, రమేష్ పాల్గొన్నారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సహకార వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్‌తో కలిసి జిల్లా సహకార శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరీకరణ, మోడల్ బైలాల ఆమోదం, గిడ్డంగుల నిర్మాణం, సీఎస్‌సీల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి నర్సయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ సంచాలకులు వై.రమేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ముఖ్య నిర్వహణ అధికారి శ్రీధర్ రెడ్డి, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

పరిహారం పెంచాలని రైతుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జైపూర్: మండలంలోని నర్వ, ఏల్కంటి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, వేలాల, గోపాల్‌పూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు నష్టపోతున్న రైతులకు తక్కువగా నష్టపరిహారం ఇస్తూ నోటీసులు జారీ చేశారని, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని తహసీల్దార్ వనజారెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. 2017లో పార్వతి బ్యారేజీలో భూములు కోల్పోయిన రైతులకు ఒక్క ఎకరాకు రూ.8.20లక్షలు ఇచ్చారని, ఎనిమిదేళ్లు గడిచిందని, బహిరంగ మార్కెట్‌లో భూముల విలువ ఐదు రేట్లు పెరిగిందని, ఒక్క ఎకరాకు రూ.కోటి వరకు ఉందని తెలిపారు. ఇందారం ఓపెన్‌కాస్టులో అత్యధికంగా రూ.24లక్షలు ఎకరాకు ఇచ్చారని, హైవే రోడ్డుల్లో కోల్పోతున్న రైతులకు అతి తక్కువగా రూ.4.31లక్షలు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. రైతు సంఘాల నాయకులు నర్సింగారావు, కట్కూరి రాంరెడ్డి, కృష్ణమూర్తి, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.